

అంకితభావంతో పనిచేయాలి

తిరుపతి టౌన్ : రూరల్‌పరిధిలోని వెంకటపతినగర్ విలేజి హెల్త్‌క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సందర్శించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచికలపై, అసంక్రమిత, సంక్రమిత వ్యాధుల ఫాలోఅప్, అంగన్‌వాడీ సేవలు, రక్తహీనత, క్యాన్సర్ పేషంట్ల ఫాలోఅప్‌పై సమీక్షించారు. మంచానికే పరిమితమైన రోగుల గృహ సందర్శన చేసి దిశనిర్దేశం చేయాలన్నారు. ఎఎన్‌ఎం వివరిస్తూ క్లినిక్ పరిధిలో 29 మంది బాలింతలు ఉన్నారని, అందులో 19 మంది మధ్యస్థ రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి క్రమం తప్పకుండా ఐఎఫ్ఎ మందులు అందిస్తున్నామని చెప్పారు. సచివాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉందని సర్పంచి సుబ్రమణ్యం యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, సిడిపిఒ జ్యోతి పాల్గొన్నారు.

రుయా...లేదా మాపై దయ..!

- 506 మందికి గాను కేవలం 95 మందితోనే పనులు
- వారిలోనూ తరచూ 10 మంది గైర్హాజరు
- నియామకాలు చేపట్టకుండా అధికారుల నిర్లక్ష్యం
- ఆధిపత్యం కోసం రెండు గ్రూపులు పట్టు
- ఫలితంగా పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి- తిరుపతి

వైద్యరంగంలో రాయలసీమకే తలమానికంగా నిలుస్తూ , పేద ప్రజల ఆరోగ్య పెన్నిధిగా విరాజిల్లుతోన్న తిరుపతి రుయా ఆసుపత్రిలో నాలుగో తరగతి సిబ్బందిపై తీవ్ర పనిభారం పడుతోంది. 506 మంది చేయాల్సిన పనిని కేవలం 95 మందితో సరిపెడుతున్నారు. పైగా వారిలోనూ మరో 10 మంది అనారోగ్యం, వివిధ కారణాలతో పనులకు గైర్హాజరు అయ్యే పరిస్థితి నెలకొంటోంది. గత పదేళ్లుగా రుయాలో కీలకంగా పనిచేసిన ఓ అధికారే ప్రస్తుతం జిల్లా అధికారిగా ఉన్నా తమ సమస్యలు పట్టించుకోలేదన్నది వారి ఆవేదన. రుయాలో ఉన్న అధికారులు సైతం ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తూ సమస్యను మరింత జఠిలం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే తమకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని రుయా సిబ్బంది వాపోతున్నారు. ఇవేమీ తమకు పట్టనట్లు అటు ఉన్నతాధికారులు, ఇటు హాస్పిటల్ డెవలప్‌మెం ట్ కమిటీ చోద్యం చూస్తుండటం గమనార్హం. ఫలితంగా అటు వైద్య సిబ్బంది, ఇటు నాలుగోతరగతి ఉద్యోగులపై తీవ్ర పనిభారంతో నలిగిపోతుండటం శోచనీయం. తాజాగా తమ పనిభారాన్ని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి దృష్టికి వారు తీసుకెళ్లారు.

రాయలసీమకే ధర్మాసుపత్రిగా పేరొందిన రుయా ఆసుపత్రిలో 1182 పడకలు ఉన్నాయి. ప్రతిరోజూ సగటున 700 నుంచి 800 మంది ఓపీ సేవలకోసం రోగులు వస్తున్నారు. రుయాలో 506 మంది నాలుగవ తరగతి సిబ్బంది అవసరం ఉండగా వారిలో ప్రస్తుతం 95 మంది మాత్రమే ఉన్నారని, సాధ్యమైనంత త్వరలో సిబ్బంది నియామకాలు చేపట్టాలని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీతో పాటు ఉన్నతాధికారులకూ రుయా సూపరింటెండెంట్‌గా గతంలో పనిచేసిన డాక్టర్ భారతి అప్పట్లోనే విన్నవించినట్లు తెలుస్తోంది. అయితే అప్పటి నుంచి నియామకాల భర్తీ సమస్యాత్మకంగా మారింది. ఇక్కడే కీలకంగా పనిచేసిన ఓ అధికారి ప్రస్తుతం ఉన్నతాధికారిగా ఉండటంతో వివాదం మరింత ముదిరినట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న అధికారులు సైతం నియామకాల పట్ల చొరవ చూపకపోవడమే కాకుండా ప్రశ్నించిన వారిపట్ల అవమానకరంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది సమస్యల్ని తెలుసుకుని, వాటిని పరిష్కరించి అండగా నిలవాల్సిన యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తీవ్ర పనిభారంతో పాటు, సెలవులూ ఇవ్వడం లేదని, పని గంటలు పాటించడం లేదని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి ఇటీవలే యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో పాటు రుయా అధికారుల్లోనూ స్పందన లేకపోవడం గమనార్హం.

పీఎస్‌ఎల్వీ -సి55 రాకెట్ సక్సెస్

'షార్' శాస్త్రవేత్తలకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ షార్ నుంచి పిఎస్‌ఎల్‌వి-సి55 రాకెట్ ప్రయోగం ఘన విజయం సాధించింది. శనివారం మధ్యాహ్నం 2 గంటల 20 నిమిషాలకు ఇస్రో పీఎస్‌ఎల్వీ -సి55 రాకెట్ ద్వారా సింగపూర్ కు చెందిన టెల్ ఇయోస్ -2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపింది. ఇస్రో చైర్మన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, బి.ఎన్ రామకష్ణ, డైరెక్టర్ ఐఎస్ టి ఆర్ ఎ సి నారాయణ, డైరెక్టర్ ఎల్పీఎస్సీ, రాధాకష్ణన్, సిఎండి ఎన్‌ఎస్‌ఐఎల్ ఎం శంకరం, డైరెక్టర్ యు ఆర్ ఎస్ సి ఎస్సార్ బీజు, మిషన్ డైరెక్టర్ ఉన్నికష్ణన్, డైరెక్టర్ వి ఎస్ ఎస్ సి తదితరులు పాల్గొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థాన ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సిపిఎం నాయకులు బి పద్మనాభయ్య, ఎస్ సాంబశివరావు, సిహెచ్ సుధాకర్ రావు, సుంకర అల్లయ్య తదితరులు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

షార్‌లో పిఎస్ఎల్‌వి -సి 55 రాకెట్ చూడడానికి విచ్చేసిన జనం, శాస్త్రవేత్తలకు అభినందనలు

లెనిన్ ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రష్యన్ విప్లవ నేత, రాజకీయ సిద్ధాంతవేత్త లెనిన్ ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి ఉద్ఘాటించారు. లెనిన్ 153 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి యశోద నగర్ లోని ఎం బి భవన్లో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్క్ సిద్ధాంతాన్ని రష్యాలో ఆచరణలో పెట్టిన విప్లవ నేత లెనిన్ అని కొనియాడారు. రష్యాలో సోషలిస్టు సమాజ స్థాపనకు కషి చేసిన మహనీయుడు అన్నారు. ముఖ్యంగా భారతదేశంలో రష్యా స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసుకుంటున్నారని, తద్వారా మూడు రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చారని తెలిపారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా, పీడిత, అణగారిన వర్గాల ప్రయోజనాల కోసం, సోషలిజమే ప్రత్యామ్నాయమని నిరూపించిన లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి సుబ్రమణ్యం, పి సాయి లక్ష్మి, పి చిన్న, పి. ముని రాజా, బాలాజీ, వి ఎస్ మన్యం, రాధా, గీత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల క్వార్టర్స్‌ను ఆధునీకరించండి

- తిరుపతిలో క్వార్టర్స్‌ను పరిశీలించిన టీటీడీ ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టీటీడీ ఉద్యోగులు నివసించే రాంనగర్, వినాయక నగర్, కేటి క్వార్టర్స్‌ను ఆధునీకరించాలని ఈవో ఎ వి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. సమస్యలను సత్వరం పరిష్కరించడానికి ఫారెస్ట్, ఇంజినీరింగ్ , గార్డెన్, హెల్త్ విభాగాల అధికారులతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. శనివారం జేఈఓ వీర బ్రహ్మంతో కలిసి ఆయన క్వార్టర్స్ ను పరిశీలించారు.. పలువురు ఉద్యోగుల ఇళ్ళలోకి వెళ్ళి వారి కుటుంబసభ్యులతో మాట్లాడి క్వార్టర్స్ లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా క్వార్టర్స్ ను ఆధునీకరించడంతో పాటు , అవసరమైన మరమ్మత్తులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్వార్టర్స్ లో తాగునీటి సమస్యను అధిగమించేందుకు అవసరమైన చోట్ల ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, క్వార్టర్స్ లో విద్యుత్ వైరింగ్ లాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులందరు సొసైటీగా ఏర్పడి అనధికారిక వ్యక్తులు క్వార్టర్స్ లోకి రాకుండా చూసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి క్వార్టర్స్ లోకి ప్రవేశించే గేట్ల సంఖ్య తగ్గించుకోవాలని చెప్పారు. దీంతోపాటు తగినంత సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. క్వార్టర్స్ లో ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో ఈ సొసైటీ ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ఈవో సూచించారు. అధికారులతో ఏర్పాటు చేసే కమిటీ ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశమై తమ దష్టికి వచ్చిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీధుల్లో బిఎస్ఎన్ఎల్, డిష్ లాంటి వైర్లు చిందరవందరగా కాకుండా క్రమ పద్ధతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు , వారి కుటుంబసభ్యుల కోసం తిరుపతిలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ఎస్టేట్ విభాగం ఓఎస్ డి మల్లిఖార్జున, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఈఈ లు మురళీకష్ణ, మనోహర్, డిఈ లు చంద్రశేఖర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య రజనీకి ఉమెన్ అకడమిక్ అచీవర్ అవార్డు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రజనీకి ఉమెన్ అకడమిక్ అచీవర్ అవార్డు వరించింది. ధరిత్రి దినోత్సవం సందర్భంగా రీసెర్చ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ మరియు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ మేనేజ్మెంట్ వారు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు - సస్టైనబుల్ డెవలప్మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ అగ్రికల్చర్, ఐటి, మేనేజ్మెంట్, సోషియల్ సైన్సెస్ అనే అంశంపై ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగింది. ఆచార్య రజనీ ఫుడ్ టెక్నాలజీ రంగంలో చేసినటువంటి పరిశోధనలు, సామాజిక కార్యక్రమాలకు గాను ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగిందని ఐఐపిఎం డైరెక్టర్ ప్రొఫెసర్ సుదీప్ కుమార్ గోస్ తెలిపారు. వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె. రాజారెడ్డి , టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆచార్య రజినికి అభినందనలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్

తిరుపతి టౌన్ : మానవ తప్పిదాల కారణంగా కాలుష్యం పెరిగి భూమికి పెను ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉందని, పర్యావరణ పరిరక్షణ భాద్యత మన అందరి పై ఉందని , కాబట్టి పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి మన ధరిత్రిని భవిష్యత్తు తరాల కోసం పరిరక్షించి అందివ్వాలని జిల్లా కలెక్టర్ కె వెంకట రమణ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, తిరుపతి వారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్.వి.ఆర్ట్స్ కళాశాల నుండి బాలాజీ కాలనీ మీదుగా రామచంద్ర పుష్కరిణి వరకు ఏర్పాటు చేసిన పర్యావరణ ర్యాలీని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ సైన్స్ సెంటర్ పాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రు, ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి పర్యావరణ ఇంజనీరు నరేంద్ర బాబు, ఏఈ మదన్ మోహన్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి -రేణిగుంట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు.. డీఎస్పీ రామచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రమణ విలాస్ సర్కిల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పారిపోతున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేణిగుంట పట్టణానికి చెందిన ఖాదర్ భాషా, విశ్వలుగా గుర్తించామని.. కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రంజాన్ వేడుకలు శనివారం ఉదయం ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ ప్రార్థన కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమున కరుణాకర్ రెడ్డి, ఎంపీ డాక్టర్ గురుమూర్తి ,ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, టిడిపి మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, టిడిపి కార్పొరేటర్ ఆర్సి మునికష్ణ, టిడిపి సీనియర్ నాయకులు పులిగోరు మురళి కష్ణారెడ్డిలు ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపారు.

త్రిపుర సంఘీభావ నిధికి విరాళం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: త్రిపుర రాష్ట్రంలో సీఐటీయు కార్యాలయాలపై, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ బీతావహ పరిస్థితిని సష్టిస్తున్న బిజెపి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ తిరుపతిలో సంఘీభావ నిధిని వసూలు చేశారు. దాడులకు, హత్యలకు గురైన కుటుంబాలకు ఈ నిధిని అందజేస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. లక్ష్మి ఆధ్వర్యంలో కార్మికులు, ప్రజల నుంచి రూ.5477 వసూలు చేసి సిఐటియు జిల్లా కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షు లు జి. బాలసుబ్రమణ్యం లకు అందజేశారు. లక్ష్మి కృషిని వారు అభినందించారు.

తిరుపతి అభివృద్ధికి బిజెపి అడ్డు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఎక్కడైనా రాజకీయ పార్టీలంటే ప్రజల ప్రయోజనాలు మిన్నగా భావించి ఆందోళన చేస్తుంటారు. తిరుపతిలో బిజెపి అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. తిరుపతి అభివృద్ధిని ప్రతిసారీ అడ్డుకుంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులకు గురిచేయడం పరిపాటయ్యింది. తిరుపతిలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పలు రాజకీయ పార్టీలు అధికార పార్టీ దృష్టికి తీసుకొచ్చాయి. ఇందుకోసం ఫ్లైఓవర్ ఒక్కటే సరైన మార్గమని, ఈ మేరకు టిటిడి సహకరించాలని తెలుగుదేశం హయాంలో రూపకల్పన చేశారు. వైసిపి హయాంలో ఇప్పటికి మూడో దశ పనులు పూర్తయ్యి జఠిలంగా ఉన్న ట్రాఫిక్ సమస్య కొంతవరకూ పరిష్కారమయ్యింది. అయితే టిటిడి నిధులతో శ్రీనివాస సేతు నిర్మించరాదంటూ బిజెపి హైకోర్టును ఆశ్రయించింది. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థమే నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును అడ్డుకోరాదని కోర్టు అక్షింతలు వేయడంతో వెనక్కి తగ్గింది. ఆ తరువాత టిటిడి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ పోస్టులను, విద్యార్థులను అన్యమతస్తులను చేర్చరాదని యాగీ చేసింది. అయితే ఇది కూడా అప్పట్లో బిజెపిపై వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి రావడంతో వెనక్కి తగ్గారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో తాత్కాలిక కలెక్టరేట్ కోసం తిరుచానూరు బైపాస్‌లో ఖాళీగా ఉన్న పద్మావతి నిలయాన్ని (కరోనా సమయంలో కోవిడ్ సెంటర్‌గా సేవలందించిన భవనం) అద్దె ప్రాతిపదికన ప్రభుత్వం తీసుకుంది. కలెక్టరేట్‌ను టిటిడి భవనాల్లో నిర్మించరాదని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోర్టుకెక్కి మరోసారి మొట్టికాయ వేసుకున్నారు. తాజాగా ఈ భవనాన్ని వంద కోట్లకు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా నుంచి కలెక్టర్ ప్రతిపాదన పంపారు. భక్తుల విరాళాలతో నిర్మించిన టిటిడి భవనాన్ని ఎలా ప్రభుత్వానికి అమ్మకానికి పెడతారంటూ విలేకరుల సమావేశంలో సెంటిమెంట్ ఆధారంగా భానుప్రకాష్‌రెడ్డి మరోసారి మాట్లాడటం గమనార్హం. అలాగే స్విమ్స్‌లో డాక్టర్లు, ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి 142 పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇవ్వగా, అన్యమతస్తులను వైద్యులుగా చేర్చడానికి వీల్లేదంటూ బిజెపి రాద్ధాంతం చేస్తూ ధర్నా చేపట్టింది. ఏది ఏమైనప్పటికీ తిరుపతి అభివృద్ధికి అడుగడుగునా బిజెపి అడ్డుపడటం, ప్రజలనుంచి వ్యతిరేకత వచ్చినా, కోర్టు మొట్టికాయలు వేసినా వెనక్కి తగ్గడం పరిపాటయ్యింది.

పద్మావతి నిలయాన్ని కలెక్టరేట్‌కు శాశ్వతంగా ఇవ్వరాదంటూ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం..!

ముస్లిం సోదరులకు 'ప్రచారభేరి'లో శుభాకాంక్షలు

ప్రజాశక్తి - రేణిగుంట

ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై, మతాల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాద బిజెపిని 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడించి ఢిల్లీ నుండి సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం! అనే నినాదంతో రేణిగుంటలో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచారభేరిని రంజాన్ పండుగ పురస్కరించుకుని ప్రారంభించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రచార యాత్ర సాగుతుందని సిపిఎం, సిపిఐ నేతలు తెలిపారు. వినాయకనగర్, బుగ్గవీధిలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచారు. సిపిఎం మండల కార్యదర్శి కె.హరినాథ్, సిపిఐ మండల కార్యదర్శి చలపతి, జిల్లా నాయకులు తులసిరాజన్‌లు రంజాన్ పండుగ సందర్భంగా ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాజేశ్వరి, నాయకులు వెంకటరమణ, శివానందం, సెల్వరాజ్, నరసింహారెడ్డి, కుప్పస్వామి, మాజీ వార్డు మెంబర్ ఈశ్వరమ్మ, సులోచన, మహాలక్ష్మమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

రేణిగుంటలో ప్రచారభేరి యాత్ర

సత్యవేడులో... సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు.

చిల్లకూరులో..మండల పరిధిలో నేలపల్లి రెడ్డిపల్లి గ్రామంలో ప్రచారభేరి పాదయాత్ర శనివారం చేరుకుంది. ఈనెల 24న సోమవారం గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో బహిరంగసభ జరుగుతుందని నేతలు జోగి శివకుమార్, ముత్యాలయ్య, ప్రసాద్, బివి రమణయ్య, సిహెచ్ ప్రభాకర్ తెలిపారు.

దామలచెరువు సంతలో 'చెవిరెడ్డి ఉచిత భోజనం'

ప్రజాశక్తి-పాకాల: చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దామలచెరువు వారపు సంతలో రైతులకు 'చెవిరెడ్డి ఉచిత భోజనం' పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దామలచెరువు వారపు సంతలో దాదాపు 250 మంది రైతన్నలు తాము పండించిన పంటలను విక్రయించేందుకు రాగా వందల సంఖ్యలో కొనుగోలుదారులు ఉచిత భోజన కార్యక్రమానికి విచ్చేశారు. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 3 గంటల వరకు భోజన పంపిణీ కార్యక్రమం సాగింది. దామలచెరువుతో పాటు పదిపుట్ల బైలు, ఈపాలగుట్ట పల్లి, వల్లివేడు, రమణయ్య గారి పల్లి, మొగరాల నుంచే కాకుండా చిత్తూరు జిల్లా ఐరాల మండలం నుంచి కూరగాయల కొనుగోలుకు ప్రజలు విచ్చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ విక్రయదారులు, కొనుగోలుదారులు ఆకలి తీర్చేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఉచిత భోజనం, అల్పాహారం అందించారన్నారు. చెవిరెడ్డి ఉచిత భోజనం ప్రక్రియ ఇకపై నిరంతరాయంగ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దాసుకుప్పం బైపాస్..!

- రోడ్డు నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు
- సత్యవేడు నియోజకవర్గ ప్రజల హర్షం

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు మండలం దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మహర్దశ కలిగింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో రెండు దశాబ్దాలుగా కార్యరూపం దాల్చని దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణ కల నేటికి నెరవేరనుంది. రోడ్డు నిర్మాణానికి రూ.27 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసి కీర్తిశేషులు అయిన డాక్టర్ శివప్రసాద్ సత్యవేడు ఎమ్మెల్యేగా కొనసాగినప్పుడే దీనికి బీజం పడింది. అప్పట్లో బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలోనే శివప్రసాద్ దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకం సైతం ఆవిష్కరించారు. అయితే రోడ్డు నిర్మాణానికి సంబంధించి దాసుకుప్పానికి చెందిన ఇద్దరు నాయకుల మధ్య సమస్య తలెత్తడంతో ఆర్అండ్‌బీ అధికారులు చేపట్టిన భూ సేకరణ ఆగిపోవడంతో బైపాస్ రోడ్డు నిర్మాణం అటకెక్కింది. అనంతరం ఎమ్మెల్యేలుగా ఎవరూ దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించలేకపోయారు.

ఎమ్మెల్యే ఆదిమూలం ప్రత్యేక కృషి

సత్యవేడు ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం అధికారం చేపట్టగానే రెండు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమై కార్యరూపం దాల్చని దాసుకుప్పం బైపాస్ రోడ్డు విషయాన్ని అధికార పక్షానికి చెందిన స్థానిక నాయకులు పలువురు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. దీంతో దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం సంబంధించి ఎమ్మెల్యే ఆదిమూలం ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే రెండేళ్ల క్రితమే అధికారులతో కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వ ఆమోదానికి పంపారు. దీంతోపాటు అప్పట్లో ఎమ్మెల్యే ఆదిమూలం అప్పటి కలెక్టర్‌తో కలిసి అధికారుల ప్రతిపాదిత దాసుకుప్పం రోడ్డు నిర్మాణం మార్గాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెళ్లారు. ఎమ్మెల్యే గత రెండేళ్లుగా పట్టు వదలని విక్రమార్కుడిలా బైపాస్ రోడ్డు నిర్మాణ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని పలుమార్లు కలిసి మంజూరు కోసం అభ్యర్థించారు. ఎట్టకేలకు దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.27 కోట్లను మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ప్రధాన రోడ్డు మార్గంలోని దాసుకుప్పం విద్యుత్తు ఉపకేంద్రం మలుపు నుంచి నాగలాపురం మండలం కారణి గ్రామానికి సమీపంలో హైవేలో వరకు రోడ్డు కలుస్తోంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే తమిళనాడులోని ఊత్తుకోట పోలీసుల నుంచి ఆంధ్ర వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోతాయి. దాసుకుపం బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే బైపాస్ పనులకు చర్యలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి పలుమార్లు దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం విషయాన్ని తీసుకెళ్లాను. రూ.27 కోట్ల నిధులు మంజూరు చేశారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

- కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు

మత సామరస్యానికి ప్రతీక.. రంజాన్..!

గూడూరులో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం సోదరులు

పుత్తూరులో ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: మత సామరస్యానికి ప్రతీక.. రంజాన్ పర్వదినమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని పెద్ద మసీదు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులు తనను ఎంతగానో ఆదరించారని, నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ కతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో గూడూరులో మసీదు నిర్మాణం చేపట్టేలా పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గూడూరులో కులమతాలకతీతంగా అందరూ సోదర భావంతో కలిసిమెలిసి ఉంటారని పేర్కొన్నారు.

చిన్నగొట్టిగల్లు: రంజాన్ పండుగను పురస్కరించుకుని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చిన్నగొట్టిగల్లు, దీందార్లపల్లిలోని ఈద్గాల్లో పాల్గొని ముస్లింలకు ఎంపీపీ యుగంధర్ రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ సహదేవరెడ్డితో కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఓజిలి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. పవిత్రమైన రంజాన్ మాసంలో 30 రోజుల పాటు నిష్టగా ఉపవాసం ఉంటూ రంజాన్ పండుగను మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. నిరుపేదలకు దానాలు చేశారు.

తిరుపతి(మంగళం): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళంలోని మదీనా, రౌనక్ మసీదులకు జమాత్, స్థానిక బీటీఆర్ కాలనీలోని ఈద్గా మైదానంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముతువల్లి మహబూబ్ పీరా, చాన్‌బాషా(మెడికల్), చాన్ బాషా(సెంట్రింగ్), అజీజ్, ఇమామ్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: రంజాన్ పర్వదినం సందర్భంగా పుత్తూరు పట్టణ టీడీపీ నాయకుల సమక్షంలో తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ హమీద్‌బాషా, ముస్లిం మైనార్టీ చిత్తూరు పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె సర్దార్‌లను గేట్ పుత్తూరులోని స్వగహంలో సత్కరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు పట్టణం తెలుగుదేశం పార్టీ నాయకులు, రవికుమార్, ఎన్ ఎన్ ధనపాల్, మాధవ నాయుడు, డీజే ధనపాల్, బాబు.నాయుడు, ఈశ్వర్ యాదవ్, కృష్ణ కుమార్, రాజేంద్ర, దశరథ రామయ్య, రజిని, నాగరత్న, మోహన తదితరులు పాల్గొన్నారు.

- పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పుత్తూరు పట్టణంలోని ఎన్జీవో కాలనీ ఎదురుగా ఉన్న మసీదు వద్ద ముస్లిం సోదరులు ఉపవాస దీక్షతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మంగళం ప్రాంతంలోని ఈద్గాలో ముస్లిం సోదరుల ప్రార్థనలు

చిన్నగొట్టిగల్లులో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- పుత్తూరు పట్టణంలోని పదో వార్డులో టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, పదో వార్డు అధ్యక్షుడు రూపేంద్ర, నగరి నియోజకర్గం బీసీసెల్ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఏపీవో వెంకటరమణయ్య మృతి

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు మండల ఏపీవో కుమ్మరిగుంట వెంకటరమణయ్య (50) శనివారం గుండెపోటుతో మతిచెందారు. శుక్రవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యుల సూచనల మేరకు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. అర్ధరాత్రి పరిస్థితి విషమించి ఒక్కసారిగా గుండెపోటుతో మరణించారు. ఆయన మృతికి ఉద్యోగులు, నాయకులు సంతాపం తెలిపారు.

ముగ్గురిపై రౌడీషీటర్ కేసు నమోదు

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని మేల్పూరు గ్రామంలో ముగ్గురిపై రౌడీ షీటర్ కేసు బాలాయపల్లి ఎస్సై వీరనారాయణ నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చింతల రవీంద్ర, చింతల శివరాం ప్రసాద్, కాసరం శ్రీరాములపై రౌడీ షీటర్ కేసు నమోదు చేశారు. గ్రామంలో సమస్యాత్మకంగా నేరాలు చేయడంతో రౌడీషీటర్లుగా గుర్తించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

నివాళులు - పరామర్శలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం లక్ష్మమ్మకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త అంజయ్య రోడ్డు ప్రమాదంలో మతిచెందడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి చేరుకుని అంజయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

- పరమేశ్వరమంగళంలోని మాజీ ఉపసర్పంచ్ నరసింహులు తల్లి రత్నమ్మ అనారోగ్యంతో మతిచెందారు. విషయ తెలుసుకున్న నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ గ్రామానికి చేరుకొని భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎస్సీసెల్ నాయకులు భూపాల్, ప్రధాన కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

పాకాల: సూరినేనిపల్లిలో టీడీపీ కమల్నాథ్ ఆచారి కుటుంబాన్ని శనివారం ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినిల్ పరామర్శించారు. కమల మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కమల్నాథ్ ఆచారి మరణం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోయపాటి నాగరాజు నాయుడు, నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, కొంగర బాలాజీ, దామోదర్ నాయుడు, కష్ణమూర్తి, సురేష్ ఆచారి, వాసు ఆచారి, రవి,కిరణ్, భరత్ నాయుడు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జై భారత్ సత్యాగ్రహ సభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 24న విజయవాడ జింఖానా మైదానంలో రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న అణిచివేత ధోరణికి నిరసనగా జై భారత్ సత్యాగ్రహ సభను నిర్వహించనున్నామని పిసిసి సభ్యులు మాంగాటి గోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదానిని కాపాడటానికి ప్రయత్నిస్తోందని, రాహుల్ గాంధీ పార్లమెంటు సమావేశాల్లో అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని పదేపదే సమావేశాల్లో డిమాండ్ చేయడంతో ఎలాగైనా రాహుల్ గాంధీని కట్టడి చేయాలని, రాజకీయంగా అణిచివేయాలని కుట్ర పూరితంగా ఆలోచించి పరువు నష్టం కేసులో ఆగమేఘాలపై కోర్టు తీర్పును రప్పించి ఆపై వెంటనే మరుసటి రోజే పార్లమెంటు కార్యదర్శితో రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రకటింప చేశారని తెలిపారు.

స్విమ్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీడీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్స్ ఆసుపత్రిలో పేదలందరికీ ఉచితంగా వైద్యం అందించాలని పీసీసీ సభ్యులు యార్లపల్లి గోపి డిమాండ్ చేశారు. శనివారం నగర పరిధిలోని స్విమ్స్ హాస్పిటల్ వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో స్విమ్స్ ఆసుపత్రిని ప్రారంభించారన్నారు. నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు అపోలో ఆసుపత్రికి అప్పగించాలని నిర్ణయించిన సమయంలో అప్పటి తిరుపతి పార్లమెంటు సభ్యులు చింతామోహన్ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తో చర్చించి ప్రధానమంత్రి నిధుల నుంచి రూ.60 కోట్లను స్విమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. టీటీడీ అనుబంధ సంస్థలలో ఎస్సీలకు 16శాతం, ఎస్టీలకు 7 శాతం, ఓబీసీలకు 27 శాతం ఉద్యోగాల నియామకాలలో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్విమ్స్ వైద్యాధికారి రామ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు రవి, పూతలపట్టు ప్రభాకర్, పంటా శ్రీనివాసులు రెడ్డి, పూల చంద్రశేఖర్, పోలా భాస్కర్, రావణ్, తేజోవతి, శాంతి యాదవ్, వెంకటేష్ గౌడ్, పోటుగారి భాస్కర్ పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యత ప్రగతికి మూలం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జాతీయ సేవా పథకం యూనిట్-3 దత్తత గ్రామమైన తనపల్లి లో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా శనివారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని, పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు, లింగ సమానత్వం-ప్రగతికి మూలం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. యూనిట్ 3 ప్రోగ్రాం అధికారిని డాక్టర్ నీరజ మాట్లాడుతూ స్త్రీలు ప్రకృతితో ప్రత్యేకమైన, సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటారని తెలిపారు.

అభివృద్ధిని అందించడమే లక్ష్యం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధిని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. శనివారం మంగళం పంచాయతీలోని మంగళం క్వార్టర్స్ లో పదో రోజు మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పాలనలో వైసిపి నేతలు ఇష్టం వచ్చినట్లు ప్రజల సొమ్మును దోచుకుని తింటున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. సంక్షేమం మాటున భారీ అవినీతి జరుగుతోందన్నారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరల పెంపుతోపాటు చెత్త పన్ను, ఇంటి పన్ను తదితరాల పేరుతో ప్రతి కుటుంబం నుంచి ఏడాదికి కనీసం లక్ష రూపాయిలు దోచుకుంటుంన్నారన్నారు. రంజాన్ సందర్భంగా స్థానిక ముస్లిం సోదరులకు పులివర్తి నాని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, అలిమినేని మధు, ఈశ్వరయ్య, సురేష్ నాయుడు, చలపతి, వార్డు సభ్యులు నాగరాజు, రమణ, సూరి, బాలాజీ, రామూర్తి యాదవ్, ధనమ్మ, గోపీనాథ్, భాస్కర్ రెడ్డి, మధుబాబు, ధర్మారెడ్డి, భారతి, లక్ష్మీ, గురుస్వామి, రవి పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుపై రాళ్లు వేయడం దారుణం

ప్రజాశక్తి-గూడూరు: ప్రకాశం జిల్లా పర్యటనలోని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని.. ఇలాంటి సంఘటనలు జరిగితే టీడీపీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని గూడూరు పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ వెల్లడించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లాలో పర్యటిస్తున్నారని.. శనివారం సభలో పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చొక్కా తీసి అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని వైసీపీ క్రమశిక్షణ తెలియజేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రిపై రాళ్ల వేయడంతో ఎన్ఎస్‌జీ కమాండర్‌కు గాయాలయ్యాయని.. మాజీ ముఖ్యమంత్రికే రక్షణ లేకుండా పోతే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. హేయమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. భాస్కర్‌రెడ్డి, చెంచురామయ్య, ఇజ్రాయిల్, నరసింహులు, రమణయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: వైసీపీ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని..అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం సింగనాలతూరు, మేలనాలతూరు, చవటకండ్రిగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. అర్హులైన ప్రతిఒక్కరికీ అభివృద్ధి పథకాలు అందించాలన్న వైసిపి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. పేదల అభివద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేసి నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రతిఒక్కరూ ఆశీర్వదించి ఆయన మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందిస్తూ అభివద్ధి పథకాలు అందుతున్నాయా.. లేవా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్టు బోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మండల నాయకులు బాబురెడ్డి, సురేష్‌రెడ్డి, మునస్వామినాయుడు, మణి , తహశీల్దారు గోపిరెడ్డి, ఎంపీడీవో సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈ వేడుకల్లో అఖిల్ సందడి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో జోష్-2023 వార్షికోత్సవ వేడుకల్లో సినీ నటుడు అక్కినేని అఖిల్ పాల్గొని సందడి చేశారు. ఈనెల 28న అఖిల్ నటించిన చిత్రం ' ఏజెంట్ ' ప్రమోషన్ లో భాగంగా కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో అక్కినేని అఖిల్, ఏజెంట్ చిత్ర కథానాయకి సాక్షివైద్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కినేని అఖిల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి లక్ష్య సాధన కోసం కృషి చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవడం అసాధ్యం కాదన్నారు. జోష్ కార్యక్రమంలో భాగంగా కేరాఫ్ కంచరపాలెం చిత్ర సంగీత దర్శకులు శ్వీకర్ అగస్తి తన బందంతో చక్కటి సంగీత విభావరిని అందించి కార్యక్రమానికి మరింత జోష్ తెప్పించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ ప్రకాష్ అంబవరం, కన్వీనర్లు మురళీకృష్ణ, లక్ష్మీదేవి, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక నారద పుష్కరిణి వద్ద ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకురాలు చక్రాల ఉష మాట్లాడుతూ వేసవి తాపం ఎక్కువ అవుతున్న కారణంగా బాటసారులకు, ప్రయాణికులకు భక్తులకు నీరు అందివ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చక్రాల మురళీ మహేష్, జ్ఞానేష్, యుగంధర్, నవ భారత యువజన సంఘ అధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు, కేశవ రాజా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యానికి యువత ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని ఆదిశేషారెడ్డి స్టేడియంలో నిత్యం వాకింగ్ చేసే యువకుల సేవా స్ఫూర్తి మరువలేనిదని గూడూరు శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఆదిశేషారెడ్డి స్టేడియంలో దేవదానమ్మ అనే వృద్ధురాలికి యువకులు, క్రీడాకారులు కలిసి ఆమెకు ఆర్థిక సహాయం చేయడం చాలా సంతోషకరమన్నారు. ఆమెకు అనుకోకుండా పక్షవాతం రావడంతో వారితోపాటు ఎమ్మెల్యే సైతం సైతం కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఈతముక్కల వెంకటరమణయ్య, సందీప్ నాయుడు , క్రీడాకారులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.